'ప్రజావాణి'కి మొక్కుబడిగా రావొద్దు

● వనపర్తి కలెక్టర్ ఆదర్శ్‌సురభి ● ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ

వనపర్తి, జూన్ 24 : ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు మొక్కుబడిగా కాకుండా బాధ్యతగా హాజరై ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, నగేశ్‌లతో కలిసి కలెక్టర్ ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించి సమాచారాన్ని ఫిర్యాదు దారుడికి పంపడమే కాకుండా నివేదికను తనకు పంపించాలని ఆదేశించారు. ప్రజావాణికి మొత్తం 97ఫిర్యాదులు రాగా సంబంధిత అధికారులకు పంపించామని, వాటిని పరిష్కరించే విధంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు.

ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ ఆఫీస్‌లు అమలు

వచ్చే వారం నుంచి అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ ఆఫీస్ ద్వారా ఉత్తర ప్రత్యుత్తరాలు జరగాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అందుకు అవసరమైన లాగిన్లు, శిక్షణ కార్యక్రమం ఈ వారంలో పూర్తి కావాలన్నారు.

ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలి

గద్వాల, జూన్ 24 : ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన దరఖాస్తులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు మొత్తం 45 ఫిర్యాదులు అందజేశారని ఆయన తెలిపారు. ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులపై ఆయా శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో రాంచందర్ , జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు స్వీకరిస్తున్న వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

పోలీస్ ప్రజావాణికి 15 ఫిర్యాదులు

వనపర్తి టౌన్, జూన్ 24 : వనపర్తి జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 15 ఫిర్యాదులు అందాయని ఎస్పీ రక్షితా మూర్తి చెప్పారు. జిల్లాలోని నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఆమె మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను చట్ట ప్రకారం పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. భూ ఫిర్యాదులు 10, భార్యాభర్తల ఫిర్యాదులు 5 మొత్తం 15 ఫిర్యాదులు అందాయని ఆమె చెప్పారు.

ఫిర్యాదులను స్వీకరిస్తున్న వనపర్తి ఎస్పీ రక్షితామూర్తి

ధరణి ఫిర్యాదులు త్వరగా పరిష్కరించాలి

● వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి, జూన్ 24 : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి జిల్లాలోని వివిధ మండలాల తాసీల్దార్లను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో తాసీల్దార్లు, డిప్యూటీ తాసీల్దార్లతో ధరణి, భూమి మార్కెట్ విలువలు, విద్యుత్ సబ్ స్టేషన్లకు భూసేకరణ సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ రికార్డుల పరిరక్షణ, ధరణి దరఖాస్తుల పరిష్కారంపై అవగాహన కల్పించారు. హిందూ యాక్ట్, భూ రికార్డుల యాక్ట్‌లను క్షుణ్ణంగా చదివి ధరణి సమస్యలు పరిష్కరించాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను తెలుసుకునే ప్రయత్నం చేయాలన్నారు. పెండింగ్, మ్యుటేషన్, సక్సేషన్, కరెక్షన్ వంటి సమస్యలు ఏ విధంగా పరిష్కరించాలన్న దానిపై అవగాహన కల్పించారు. రిజిస్ట్రేషన్‌లో భూమి మార్కెట్ నిర్ధారిత విలువ చాలా కాలం నుంచి ఒకే విధంగా ఉందని, కాలానుగుణంగా మారిన సరాసరి మార్కెట్ విలువ నిర్ధారించి మండలం వారీగా నివేదిక ఇవ్వాలన్నారు. జిల్లాలో రైస్ మిల్లర్లు తమ మిల్లు సామర్థ్యం మేరకు మిల్లింగ్ చేసి ధాన్యాన్ని ఎఫ్‌సీఐకి అందించడం లేదన్నారు. తాసీల్దార్లు తమ పరిధిలోని రైస్ మిల్లర్లపై ఒత్తిడి పెంచి సకాలంలో ధాన్యం అప్పగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌ల ఏర్పాటుకు తాసీల్దార్లు భూమి సేకరించి విద్యుత్ శాఖకు కేటాయించే క్రమంలో ఉన్న ఇబ్బందులను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. కోర్టు కేసులు ఉంటే వాటిని క్షుణ్ణంగా చదివి తదుపరి చర్యలు చేపట్టి త్వరగా భూమి కేటాయించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్ ఎం.నగేశ్, ఆర్డీవో పద్మావతి, సబ్ రిజిస్ట్రార్ రాజేశ్, తాసీల్దార్లు, డీటీలు తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి సూచికలు పీఏసీసీఎస్‌లు

సింగిల్ విండో సూపర్ మార్కెట్‌ను సందర్శిస్తున్న సీజీఎం సుశీల

● నాబార్డ్ సీజీఎం సుశీల

అయిజ, జూన్ 24: రైతుల అభ్యున్నతికి పీఏసీసీఎస్‌లు సూచికలని నాబార్డ్ సీజీఎం సుశీల చింతాల అన్నారు. నిస్వార్థంగా సేవలు అందించి పీఏసీసీఎస్‌ల అభివృద్ధికి పాటుపడుతూ రైతులను ఆదుకోవాలని సూచించారు. సోమవారం పట్టణంలోని సింగిల్ విండో కార్యాలయాన్ని డీజీఎం శ్వేతా సింగ్‌తో కలిసి సీజీఎం సందర్శించారు. ఈ సందర్భంగా సింగిల్ విండో ద్వారా జరుగుతున్న కార్యకలాపాలను అడిగి తెలుసుకున్నారు. సింగిల్ విండో ద్వారా ఎరువులతోపాటు పెస్టిసైడ్స్ విక్రయాలు, సూపర్ మార్కెట్ తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎక్కడాలేని విధంగా అయిజ సింగిల్ విండో ఆర్థికంగా బలోపేతమవడం సంతోషకరమన్నారు. అభివృద్ధి చెందుతున్న పీఏసీసీఎస్‌లలో అయిజ ఒకటని పేర్కొన్నారు. గోదాం నిర్మాణానికి, పెట్రోల్ బంక్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని సీజీఎంను చైర్మన్ కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ సీఈవో లక్ష్మయ్య, మాన వపాడు, వడ్డేపల్లి చైర్మన్లు శ్రీధర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, నాబార్డ్ డీడీఎంలు షణ్ముగ చారి, మనోహర్‌రెడ్డి, పీడీసెల్ ఇన్‌చార్జి అశోక్‌కుమార్, లీడ్ బ్యాంక్ మేనేజర్ అయ్యపురెడ్డి, కార్యదర్శి మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యపై టీచర్లకు శిక్షణ తరగతులు

శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న జిల్లా అధికారిణి సుధారాణి

మల్దకల్, జూన్ 24 : మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నుంచి అంగన్‌వాడీ టీచర్లకు మండల కేంద్రంలోని రైతు వేదిక భవనం, అలాగే జూనియర్ కళాశాలలో సీడీపీవో కమలాదేవి ఆధ్వర్యంలో ప్రాథమిక విద్యపై శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా సంక్షేమ అధికారిణి సుధారాణి హాజరై మాట్లాడారు. మల్దకల్ ప్రాజెక్టు పరిధిలోని 196 అంగన్‌వాడీ సెంటర్ల టీచర్లకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. జాతీయ విద్యా విధానంలో భాగంగా నూతన పాఠ్య ప్రణాళికను అనుసరించి కేంద్రాల్లో బోధించాలని సూచించారు. సీడీపీవో మాట్లాడుతూ ప్రియదర్శిని పుస్తకంలో 9 అంశాలు, 43 వారాల ప్రణాళికలు రూపొందించారన్నారు. ఈ ప్రణాళిక ఆధారంగా టీచర్లు చిన్నారులకు బోదించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ కల్యాణ్, రఘునాథ్ రెడ్డి, సూపర్‌వైజర్లు నాగరాణి, సంధ్య, వాసంతి, మూడు మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల సౌకర్యార్థం బస్సులు నడపాలి

అయిజ, జూన్ 24: అయిజ పట్టణం నుంచి ప్రతిరోజూ ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటుందని, ప్రయాణికుల సౌకర్యార్థం రైళ్ల వేళ్లల్లో ఆర్టీసీ బస్సులు రైల్వే స్టేషన్ వరకు నడపాలని గద్వాల డిపో మేనేజర్ మంజులను అయిజ కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు మధుకుమార్ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. రైళ్లల్లో అధిక శాతం మంది వచ్చి, పోతుంటారని, రైళ్ల వేళ్లల్లో బస్సుల సంఖ్య తగ్గుతుండడంతో ప్రయాణికులు మెయిన్ రోడ్డు వరకు నడిచి వచ్చి బస్సుల్లో ప్రయాణించేందుకు ఇబ్బందులు పడుతున్నారని ఆమె దృష్టికి తెచ్చారు. నిత్యం అయిజ నుంచి గద్వాల బస్సుల సంఖ్యను పెంచడంతో పాటు రైల్వే స్టేషన్ వరకు బస్సులను నడిపేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పాఠశాల, అంగన్‌వాడీల్లో మౌలిక వసతుల పరిశీలన

వనపర్తి, జూన్ 24 : మండలంలోని కిష్టగిరి గ్రామ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లోని మౌలిక వసతులను ఎంపీడీవో రాఘవ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని, ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మదన్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే మెరుగైన విద్య


పాఠ్య పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో అధ్యాపకులు

అయిజ, జూన్ 24: ప్రభుత్వ కళాశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాములు అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలను ప్రిన్సిపాల్ అందజేశారు. ప్రభుత్వ కళాశాలల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధన చేస్తున్నట్లు తెలిపారు. పట్టణ, మండలంలోని విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో చేరి ప్రతిభ కనబర్చి కళాశాల, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్‌ల పంపిణీ

కేటీదొడ్డి, జూన్ 24 : విద్యార్థులు బాగా చదువుకొని ప్రయోజకులు కావాలని జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయ కార్యనిర్వహణ అధికారి పురేందర్‌కుమార్ సూచించారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలోని 1వ నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులందరికీ ఆయన వారి తండ్రి జ్ఞాపకార్థంగా నోట్‌బుక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రధానోపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు తైబజార్ వేలం

వనపర్తి, జూన్ 24 : మున్సిపాలిటీ పరిధిలో 2024-25కు సంబంధించి మార్కెట్ తైబజార్ వేలాన్ని మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించనున్నట్లు కమిషనర్ పూర్ణచందర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు మున్సిపల్ కార్యాలయంలో రోజువారి మార్కెట్, పశువుల సంత, జంతువధశాల తదితర వాటికి బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

మదనాపురం, జూన్ 24 : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన ఘటన సోమవారం మండలంలో చోటు చేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం మండలంలోని అజ్జకొల్లు గ్రామానికి చెందిన సత్యం (23) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి స్నేహితులతో కలిసి ఎర్రగట్టు మైసమ్మ ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించి విందులో పాల్గొన్నాడు. అనంతరం మద్యం మత్తులో సదరు వ్యక్తి బైక్‌ను వేగంగా నడుపుతూ రామన్‌పాడు శివారులో మూలమలుపు వద్ద వాహనం అదుపు తప్పి కింద పడడంతో తలకు తీవ్ర గాయమై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి గట్టన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి..

గద్వాల అర్బన్, జూన్ 24 : రైలు ఢీ కొని వ్యక్తి మృతిచెందిన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్నది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ వివరాల ప్రకారం..ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని రసులాబాద్ తాసిల్ పరిధిలోని జాట్ గ్రామానికి చెందిన శివ గుప్తా(31) జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం అర్ధరాత్రి పని ముగించుకొని హోటల్ యాజమాని ఇంటికి వెళ్లే క్రమంలో రెండో రైల్వే గేటు సమీపంలో రైలు పట్టాలు దాటుతుండగా కర్నూల్ వైపు వెళ్లే గుర్తు తెలియని రైలు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు..ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ప్రభుత్వ దవాఖానకు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా: వ్యక్తికి గాయాలు

పాన్‌గల్, జూన్ 24: మండలంలోని బుసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ వ్యవసాయ పనుల నిమిత్తం సోమవారం బొల్లిగట్టు చెరువు కట్టపై ట్రాక్టర్‌పై వెళ్తుండగా అదుపుతప్పి బోల్తాపడింది. ఈఘటనలో లక్ష్మీనారాయణకు గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ఏరియా దవాఖానకు తరలించారు. చెరువుకట్ట అనేక వంపులు తిరిగి ఉండడం, రోడ్డు వెడల్పు లేకపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఉందని గ్రామస్తులు తెలిపారు. గతంలో సింగోటం జాతరకు వెళ్తుండగా ఈకట్టపై 8మంది భక్తులు మృతి చెందారని గుర్తు చేశారు.

ఇసుక డంప్‌ల పరిశీలన

పాన్‌గల్, జూన్ 24 : మండలంలోని గోప్లాపూర్, చిక్కేపల్లి, దవాజీపల్లి, రాయినిపల్లి గ్రామాలను సోమవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు మహేశ్, తిరుపతయ్య సాగర్, హెడ్‌కానిస్టేబుల్ రోషయ్య సందర్శించి అక్రమ ఇసుక డంప్‌లను పరిశీలించారు. నమస్తే తెలంగాణ దినపత్రికలో 'జోరుగా ఇసుక దందా' అనే శీర్షిక సోమవారం ప్రచురితమైనది. ఈనేపథ్యంలో రెవెన్యూ, పోలీసు అధికారులు ఆయా గ్రామాల్లోని ఇసుక డంపులను పరిశీలించి నిల్వ సామర్థ్యాలను నమోదు చేసుకున్నారు. ఇసుక డంపుల వ్యవహారంపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. పూర్తి నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

పాన్‌గల్, జూన్ 24 : గ్రామాభివృద్ధిలో ప్రజలు, ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని గ్రామస్పెషల్ అధికారి విద్యాసాగర్‌రెడ్డి అన్నారు. మండలంలోని తెల్లరాళ్లపల్లి తండా పంచాయతీకార్యదర్శి నర్మద అధ్యక్షతన సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్‌రెడ్డి మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరూ విద్య, వైద్యం, పారిశుధ్యం వంటి వాటిపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదిరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి

● ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట, జూన్ 24 : అధికారులు పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పరిష్కరించాలని దేవరకద్ర ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం కొత్తకోట సమీపంలోని భీమాఫేజ్-2 పంపు వద్ద ఇరిగేషన్, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, కొత్తకోట మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో చాలా పనులు పెండింగ్‌లో ఉన్నాయని త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించి పనులను వేగవంతంగా సాగేలా చర్యలు తీసుకుంటామని అధికారులకు సూచించారు. అంతకు ముందు మిరాసిపల్లిలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు అందజేశారు. కార్యక్రమంలో జితేందర్ రెడ్డి, మేస్త్రీ శ్రీను, సాయిరెడ్డి, కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, బీచుపల్లి యాదవ్, రమణ, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థినికి ఆర్థిక సాయం

కొత్తకోట పట్టణానికి చెందిన ఆర్యవైశ్య వైద్య విద్యార్థిని భీమా మాధురికి ఏడాది ఫీజు కోసం రూ. 50వేల ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సోమవారం అందజేశారు. తండ్రి భీమా ఆంజనేయులు అనారోగ్యంతో మృతి చెందగా ఆ విద్యార్థిని ఫీజు కట్టలేని పరిస్థితి ఉండడంతో ఆర్యవైశ్య నేతలు ఎమ్మెల్యేను ఆర్థిక సాయం అందజేయాలని కోరారు. అందుకు స్పందించి ఆర్థిక సాయాన్ని అందజేసినట్లు సంఘం నేత చంద్రకాంత్ తెలిపారు. కార్యక్రమంలో మేడిశెట్టి రాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మదనాపురం, జూన్ 24 : పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 80మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పద్మావతి, మండల అధ్యక్షుడు నాగన్న, నాయకులు గోపిస్వామి, రామకృష్ణ, రాములు, హనుమాన్‌రావు, కృష్ణ, మహేశ్, జగదీశ్, కోటేశ్, శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్, శేఖర్, నజీర్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

రాష్ట్రస్థాయిలో 'స్కాలర్స్' ప్రతిభ

వనపర్తి టౌన్, జూన్ 24 : ఇంటర్ బోర్డు విడుదల చేసిన సప్లిమెంటరీ ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని స్కాలర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటారని యాజమాన్య సభ్యులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ వరప్రసాదరావు, నాగేశ్వర్ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీధర్ తెలిపారు. ఫస్టియర్ ఎంపీసీలో షేక్ జహ్నవి 468మార్కులు, రాజు 467, సోని 467, తనూజ, నర్మద 465, అర్షిత్, భవానీ 461, 460 మార్కులు, బైపీసీలో స్రవంతి, యశస్వి 438మార్కులతో రాష్ట్ర ప్రథమ ర్యాంక్, సుమయ్య, నాజినిన్ 437మార్కులతో రాష్ట్ర ద్వితీయ ర్యాంక్, శాహిష్ణ సాహినియత్ 436, హన్సిక, సైబా సబ్రిన్, శిరీష 434మార్కులతో రాష్ట్ర 4వ ర్యాంక్‌ను సాధించారని చెప్పారు. సీఈసీ విభాగంలో హిందు 475, చందు 463 మార్కులు సాధించారని వీరిని అభినందించినట్లు వారు చెప్పారు.

పైవేట్ బడులపై చర్యలు తీసుకోవాలి

ఖిల్లాఘణపురం, జూన్ 24 : ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు కనీస వసతులు కల్పించకుండా ఫీజులు మాత్రం వసూలు చేస్తున్నారని అలాంటి పాఠశాలలను గుర్తించి చర్యలు తీసుకోవాలని తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి మానాజీ పేట రమేశ్‌గౌడ్ అధికారులను కోరారు. సోమవారం మండలకేంద్రంలోని ప్రైవేట్ స్కూళ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకొని విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడంతోపాటు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఫెడరేషన్ నేతలు ఉన్నారు.

ప్రత్యేక పరిశీలకులతో ఫౌజ్ బదిలీలు సుఖాంతం

వనపర్తి టౌన్, జూన్ 24 : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉపాధ్యాయ బదిలీలు కొనసాగుతున్నాయి. స్కూల్ అసిస్టెంట్లు ఫౌజ్ (భార్యాభర్తల) బదిలీలు ప్రక్రియ మొదలవ్వగా విద్యాశాఖ అధికారులు అనుభవం కలిగిన అధికారులను ప్రత్యేక కమిటీగా నియమించింది. ఆన్‌లైన్‌లో ఫౌజ్‌లను స్వీకరించి ఆప్షన్లను ఆయా పాఠశాలలకు కేటాయింపు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. 8 ఏండ్లకు ఒకసారి ఫౌజ్ దరఖాస్తులను చేసుకునే వెసులుబాటు ఉంది. ఫౌజ్ దరఖాస్తులతో పాటు నియమ, నిబంధనలను జిల్లా విద్యాధికారులు వెల్లడించారు. కాగా జిల్లాలోని ఏడు సబ్జెక్టుల్లోని ఫౌజ్‌కు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. అందులో గణితం విభాగంలో సుమారుగా 48మంది ఫౌజ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఆదివారం ఫౌజ్ దరఖాస్తులను డీఈవో కార్యాలయాల్లో పరిశీలించి ఆయా ఖాళీల పాఠశాలలను ఆప్షన్‌ను ఎంపిక చేసుకునే అవకాశాన్ని ఇచ్చారు. కాగా ఆత్మకూర్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయ అభ్యర్థి ఫౌజ్‌కు దరఖాస్తు చేసుకోగా నిబంధన మేరకు భర్త పనిచేసే సమీప పాఠశాలకు వెళ్లాల్సి ఉంది. కానీ పట్టణంలోనే కేటాయించాలని మొండికి వేయడంతో రెండు రోజుల పాటు విద్యాధికారులు చేపడుతున్న బదిలీల ప్రక్రియ నిలిచిపోయింది. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించడంతో రంగారెడ్డి జిల్లాకు చెందిన డీఈవో సుశీందర్‌రావు ప్రత్యేక పరిశీలకుడిగా సోమవారం జిల్లా కేంద్రానికి వచ్చారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నడుచుకోవాలని ఫౌజ్ సమీప ప్రదేశాలను ఎంపిక చేసుకోవాలని లేకపోతే అభ్యర్థిని బ్లాక్ లిస్ట్‌లో పెట్టి మిగతా వారిని కౌన్సిలింగ్ చేయాలని నివేదించారు. చివరకు అభ్యర్థి ఒప్పుకోవడంతో ఫౌజ్ కౌన్సిలింగ్ కొనసాగింది.

సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు

గద్వాలటౌన్, జూన్ 24 : ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఫలితాల్లో జిల్లా ఉత్తమ ఫలితాలను సొంతం చేసుకున్నది. మొత్తం 3,697 విద్యార్థులు పరీక్ష రాయగా 2,192 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ఫస్టియర్ జనరల్‌లో 2,045 మంది పరీక్ష రాయగా 1,244మంది ఉత్తీర్ణత సాధించారని ఇంటర్ జిల్లా విద్యాశాఖ అధికారి హృదయరాజు తెలిపారు. అలాగే ఒకేషనల్‌లో 322మంది విద్యార్థులు పరీక్ష రాయగా 203మంది విద్యార్థులు పాసయ్యారని తెలిపారు. అలాగే సెకండియర్‌లో జనరల్‌లో 1,158మంది విద్యార్థులు పరీక్ష రాయగా 650మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఒకేషనల్‌లో 172మంది విద్యార్థులకు 95మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

52.06 శాతం ఉత్తీర్ణత

వనపర్తి టౌన్, జూన్ 24 : ఇంటర్ సప్లమెంటరీ ఫలితాల్లో వనపర్తి జిల్లావ్యాప్తంగా 52.06 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు డీఐఈవో మద్దిలేటి వెల్లడించారు. జనరల్ విభాగంలో 5,330 మంది పరీక్ష రాయగా.. 2,618 మంది ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్‌లో 538మంది విద్యార్థులు పరీక్ష రాయగా.. 407మంది ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ఫస్టియర్‌లో 3,512మందికి 1,965మంది పాసయ్యారు. ఒకేషనల్‌లో 480మందికిగానూ 252మంది పాసయ్యారు. సెకండియర్‌లో 1,818మందికి గానూ 653 విద్యార్థులు పాసయ్యారు. ఒకేషనల్‌లో 384మందికి 215మంది విద్యార్థులు పాసయ్యారని తెలిపారు.

'నీట్' పేపర్ లీకేజీపై సుప్రీం కోర్టు జడ్జి విచారించాలి

అయిజ, జూన్ 24: నీట్ పేపర్ లీకేజీపై సుప్రీం కోర్టు జడ్జితో విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీం పాషా డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఇంటర్ విద్యార్థులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా హలీం పాషా మాట్లాడుతూ.. ఎంబీబీఎస్, ఇతర వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన నీట్-యూజీ ఎంట్రెన్స్‌లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలకు సంబంధించి దేశవ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రుల్లో నెలకొన్న అనుమానాలపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించక పోవడం సిగ్గు చేటన్నారు. బీహార్‌లో రూ.30లక్షలకు నీట్ ప్రశ్నాపత్రాలు విక్రయించారని, ఈ వ్యవహారంలో అరెస్టులు జరుగుతున్నాయ